## క్లుప్తంగా

### మాచన రఘునందన్‌కు అభినందన

రామగిరి(నల్లగొండ): పొగాకు నియంత్రణకై గత 22 ఏళ్లుగా పోరాటం చేస్తున్న పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ చండీగఢ్‌కు చెందిన ప్రజారోగ్య, అధ్యయన పరిశోధన సంస్థ స్ట్రాటజిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్‌హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (సైఫర్) జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం చండీగఢ్‌లో అవార్డు సెలక్షన్ కమిటీ నిర్వహించిన ఇంటర్వ్యూకు రఘునందన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను చండీగఢ్‌కు చెందిన ప్రజారోగ్య నిపుణుడు సోనూగోయల్ అభినందించారు. పొగాకు నియంత్రణకు మాచన రఘునందన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. పొగాకు నియంత్రణ సదస్సులకు హాజరుకావాల్సిందిగా రఘునందన్‌ను కోరారు.

### సినీ కార్మికులకు వేతనాలను పెంచాలి

చిట్యాల : సినీ కార్మికులకు వేతనాలను పెంచడంతో పాటు రోజువారిగా చెల్లించాలని సెంట్రల్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు వనమా వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేలాది కోట్ల రూపాయలతో చిత్రాలను నిర్మిస్తున్న నిర్మాతలు సినిమా నిర్మాణంలో అన్ని విభాగాల్లో కీలకంగా పనిచేస్తున్న కార్మికులకు తగిన న్యాయమైన వేతనాలు ఇవ్వడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. వెంటనే కార్మికులకు డిమాండ్ల మేరకు వేతనాలను చెల్లించి కార్మికుల సమ్మెను విరమింపజేయాలని ఆయన కోరారు.

### యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

శాలిగౌరారం : మండలంలోని బాలిశెట్టిగూడెంకు చెందిన జనచైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వల్లమల్ల సైదులు, ఉపాధ్యక్షుడు కల్లూరు మల్లయ్య, కార్యదర్శి కుంభం సైదులు, సహాయ కార్యదర్శి గండమల్ల రాజు, పలువురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతి

నకిరేకల్ : స్థానిక గీత కార్మిక సహకార సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మున్సిపాలిటీ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, ఆసంఘం అధ్యక్షుడు కొండ వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రంఅందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆసంఘ నాయకులు చౌగోని వెంకన్న, మల్లేబోయిన దశర థ, చౌగోని నాగయ్య, తదితరులు ఉన్నారు.

### నెర్మట, షేరిగూడెంకు బీటీ రోడ్డు నిర్మించాలి

చండూరు : నెర్మట నుండి షేరిగూడెం వరకు బీటీ రోడ్డు వేయాలని సీపీఎం మండల కార్యదర్శి ధనుంజయ డిమాండ్ చేశారు. ఇంటింటికి సీపీఎం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నెర్మట నుంచి షేరిగూడం రోడ్డు గుంతలమయం అయిందని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. త్వరగా నిధులు మజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరటి వెంకటస్వామి, స్వామి, బొమ్మరగోని యాదయ్య, నరసింహ, గ్రామప్రజలు సాయిలు, వెంకన్న, నర్సింహ్మా, రమేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న పర్సు అందజేత

కొండమల్లేపల్లి : ఆర్టీసీ బస్సులో ఎట మహిళ పోగొట్టుకున్న పర్సును ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దేవరకొండలోని తన నివాసంలో అందజేశారు. వివరాల ప్రకారం చందంపేట మండలం రేకులగడ్డ గ్రామానికి చెందిన బొమ్ము మంగమ్మ రాఖీ పండుగ సందర్భంగా తన పుట్టింకి వెళ్లే క్రమంలో పీఏపల్లి మండలం అంగడిపేట వద్ద బస్సులో తన పర్సును పోగొట్టుకుంది. ఆ సమయంలో పర్సును గుర్తించిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రమావత్ రమేష్‌నాయక్ సదరు మహిళకు గ్రామస్తుల ద్వారా సమాచారం అందించి ఆదివారం దేవరకొండలోని తన నివాసంలో అందజేశారు. ఆ పర్సులో కొంత నగదు ఉన్నట్టు తెలిపారు.

### పంచ జ్యోతిర్లింగాలకు 16న టూరిస్ట్ ట్రైన్

రామన్నపేట: పంచ జ్యోతిర్లింగ దర్శనయాత్ర నిమిత్తం ఈనెల 16న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరే భారత్ గౌరవ్ స్పెషల్ టూరిస్ట్ ట్రైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ పీవీ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, గ్రిష్ణేశ్వర్‌ల దర్శనంకోసం రైల్వే శాఖ ట్రైన్ ఏర్పాటు చేసిందన్నారు. స్లీపర్ కోచ్ ఒకరికి రూ.14,700, త్రీ ఏసీ రూ.22,900 చొప్పున చార్జీలు చెల్లించాలని, భక్తులకు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9701360701, 9281030711 నంబర్లను సంప్రదించాలని రైల్వే ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ తెలిపారు.

# అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన మైదానాలు
- బోర్డులకే పరిమితం



బట్టుగూడెంలో తుప్పపట్టిన బార్‌లు




దేవాలయం పక్కన ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

పెద్దవూర: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడాకారుల్లో నైపుణ్యతను వెలికి తీసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రీడా ప్రాంగణాలు ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారాయి. రూ.లక్షల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి గ్రామపంచాయతీలో గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. వీనికి అవసరమైన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూర్చింది. కానీ ఈ మైదానాల వల్ల ఎవరికి లబ్ధి చేకూరని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామ పంచాయతీలలో బోర్డులు ఏర్పాటు చేసి మమా అనిపించారు. ఏ ఒక్క క్రీడా మైదానాల్లోనూ ఒక్కరోజు కూడా ఆటలు ఆడిన దాఖలాలు లేవు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు అధికారులను కోరారు. పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే గ్రామంలోని యువకులు, క్రీడాకారులు పొద్దంతా ఆటలు ఆడితే విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు ఒప్పుకోలేదు.

**ఎస్టిమేషన్ బట్టి నిధులు**

క్రీడా ప్రాంగణానికి దొరికిన స్థలాన్ని బట్టి అందులో ఏర్పాటు చేసిన క్రీడల ఎస్టిమేషన్ బట్టి నిధులు మంజూరు చేశారు. ఈ మైదానాలలో కబడ్డీ, ఖో–ఖో, హైజంప్, లాంగ్‌జంప్, వాలీబాల్ కోర్టులు, వ్యాయామాల కోసం సింగిల్ బార్, డబుల్ బార్‌లు ఏర్పాటు చేస్తే స్థలాన్ని బట్టి రూ.50వేల నుంచి రూ.2.50 లక్షల వరకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో క్రీడా మైదానాలలో మట్టిని పోసి చదును చేయడం, బోర్డులు ఏర్పాటు చేయడం, కోర్టులు వేయడం, వ్యాయామాల కోసం బార్‌లు వేశారు. ఎక్కడా అన్ని క్రీడలకు కావాల్సిన కోర్టులు వేయటానికి స్థలాలు దొరకడం లేదు. కబడ్డీ, ఖో–ఖో కోర్టులు మాత్రమే వేస్తే నిధులు అంతగా రావు. దీంతో గ్రామ పంచాయతీల పాలకులు అంతగా ఆసక్తి కనపర్చ లేదని చర్చించుకుంటున్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు చాలా వరకు గ్రామాలకు దూరంగా నిర్మించారు. దీంతో అనేక గ్రామాలలో క్రీడా మైదానాలు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని పెద్దవూర మండల కేంద్రంలోనూ, నాయినవానికుంటతండా తదితర గ్రామాలలో ఇప్పటికీ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. బట్టుగూడెం, పొట్టివానితండా, లింగంపల్లి, జయరాంతండా తదితర గ్రామాలలో చాలా దూరంలో నిర్మించారు. ఏ క్రీడా ప్రాంగణంలో చూసినా కంపచెట్లు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఏర్పాటు చేసిన వాలీబాల్, డబుల్, సింగిల్ బార్‌లు తుప్పు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

**వినియోగంలోకి తీసుకువస్తాం**

గ్రామాలలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా మైదానాల వినియోగంలోకి తీసుకువస్తాం. ప్రస్తుతం మైదానాలలో కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి, మైదానాల చుట్టూ మొక్కలు నాటించి పచ్చదనంతో వాటిని ఆధునీకరిస్తాం. ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించేలా అవగాహన కల్పిస్తాం.

–ఉమాదేవి, ఎంపీడీఓ, పెద్దవూర

# భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు బోనాలు



మిర్యాలగూడ టౌన్ : గాంధీనగర్‌లో బోనాలు సమర్పించేందుకు క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య గాంధీనగర్‌లోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో గల ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం, చీరలు, గాజులు, పూలు సమర్పించారు. పోతరాజుకు భక్తులు కోళ్లు, మేకలను కోసి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల సైదులు, మున్సిపల్ మాజీ చైర్మన్ మెరుగు రోశయ్య, మాజీ వైస్ చైర్మన్ బంటు సైదులు, కోల రామస్వామి, బంటు గిరి, కోంక వెంకన్న, అవుదారపు మురళి, కోల శ్రీను, నక్క శేఖర్, నక్క భిక్షం, తదితరులు ఉన్నారు.



మిర్యాలగూడ టౌన్ : సాగర్ రోడ్డులో..

**ఘనంగా బోనాల పండుగ**

డిండి : మండల పరిధిలోని వావిల్‌కోల్‌లో ఆదివారం మర్రి ఈదమ్మ గ్రామ దేవతకు భక్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనమెత్తిన మహిళలు డప్పు చప్పుళ్లతో గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ దేవాలయానికి చేరుకొని ఈదమ్మకు నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పేరువాళ్ల జగత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బుచ్చయ్య, మల్లయ్య, తెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



డిండి : వావిల్‌కోల్‌లో..

# రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దవూర: కొత్త పట్టాదారు రైతులు ఈ నెల 13వ తేదీ వరకు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సందీప్‌కుమార్ ఆదివారం తెలిపారు. జూన్ 5వ తేదీ వరకు పట్టాధారు పాసుపుస్తకం వచ్చినా, అంతకు ముందు బీమా చేసుకోని ఆధార్‌కార్డులో 18 నుంచి 59ఏళ్ల వరకు వయస్సు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు బీమాకు సంబంధించి 2025–26 బీమా సంవత్సరం ఈ నెల 14న ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులు దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్, నామినీ ఆధార్ కార్డులు సమర్పించాలని సూచించారు.

హాలియా : నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని అనుముల మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ ఏఓ కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వారు మాత్రమే రైతు బీమాకు అర్హులని తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్‌లను మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఈనెల 13 వరకు అందించాలని తెలిపారు.

**సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు**

పెద్దవూర : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీ పనిముట్ల కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మహిళా, ఓసీ వర్గాల రైతులు ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పి.సందీప్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలు, ఆర్‌సీ జీరాక్స్‌లను జతచేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

**సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు**

హాలియా : రైతులకు సబ్సిడీపై అందించే వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల కోసం ఈనెల 13లోపు రైతు వేదిక కార్యాలయాల్లో ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జ్ ఏఓ కృష్ణయ్య తెలిపారు. ఈ పథకం ద్వారా ఎస్టీ. ఎస్సీ రైతులకు, మహిళ రైతులకు, చిన్నసన్నకారు రైతులకు యాభై శాతం సబ్సిడీపై, ఇతరులకు నలభై శాతం పనిముట్ల అందజేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా జీరాక్స్‌లను సమర్పించాలన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

నల్లగొండ టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం అన్నారు. ఆయన ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకుండా భావోద్వేగాలని రెచ్చగొడుతూ విధ్వంసపాలన కొనసాగిస్తుందన్నారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో తుమ్మల పద్మ, కుంబం కృష్ణారెడ్డి, సర్దార్ అలీ, కుంభం లక్ష్మమ్మ, సల్లోజు విష్ణుమూర్తి, కత్తుల ముత్తయ్య, సాకే వెంకటేశ్వర్లు, కుమ్మరి వెంకన్న, గనిపెల్లి రాములు, కల్లట్ల వెంకన్న, సల్లాజ విష్ణు మూర్తి, వనజ, ధనమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సలీం

# ఘనంగా సీత్లా భవాని పూజ



సీత్లా భవాని పూజల్లో పాల్గొన్న గిరిజనులు

కొండమల్లేపల్లి : గిరిజనులు ప్రతి ఏటా నిర్వహించే సీత్లా భవాని పండుగను కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బంజారా భవన్‌లో బంజారా సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలకురవాలని గిరిజనులు సీత్ల భవానికి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం కొండమల్లేపల్లి అధ్యక్షుడు రమావత్ లాలునాయక్, ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ సురేష్, ఎంఈఓ నాగేశ్వర్ రావు, బంజార సంఘం ఉద్యోగులు, బావోజీలు, నాయకులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



వేములపల్లి : మొల్కపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. ఆదివారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. బీసీలకు అమలు చేసే 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పక్షాన నిలబడి రిజర్వేషన్‌ను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో బీసీలు బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో చిరుమల భిక్షం, వై.లింగయ్య, రాంభద్రయ్య, ఎల్లయ్య, సోమయ్య, గోపి, భిక్షం, ఎల్లయ్య, లింగయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, స్టోర్ రూమ్, వంట గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణం కనపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు వార్డెన్లు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# నేటి నుంచి అంకాలమ్మ జాతర

- చిత్రియాలలో వారం రోజుల పాటు కొనసాగనున్న పండుగ
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ



జాతరలో భాగంగా అంకాలమ్మ ఊరేగింపు(ఫైల్)

చందంపేట : చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో 130 ఏళ్ల చరిత్ర కలిగిన అంకాలమ్మ జాతర సోమవారం నుంచి వారం రోజుల పాటు కొనసాగనుంది. శ్రావణమాసం సందర్భంగా జరిగే అమ్మవారి జాతరలో కాటమయ్య బోనాలు.. అమ్మవారి ఊరేగింపు ప్రధాన ఘట్టాలుగా నిలవనున్నాయి. ఇందుకు గాను ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వారం రోజుల పాటు భక్తులు ఉపవాస దీక్ష ఆచరించి నియమనిష్టలు పాటిస్తారు. జాతరలో భాగంగా మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, 2వ రోజు తొలిసేవ కార్యక్రమం, 3వ రోజు అమ్మవారి ఊరేగింపు, 4వ రోజు కాటమయ్య బోనాలు, 5వ రోజున అమ్మవారి ఊరేగింపు, చివరి రెండు రోజులు ప్రతి ఇంటికి అమ్మవారి దర్శనంతో జాతర ముగియనుంది.

**ఊరంతా సందడిగా ఉంటుంది**



శ్రావణమాసం కావడంతో అంకాలమ్మను మహిమగల అమ్మవారిని పూజిస్తాం. వారం రోజుల పాటుజరిగే ఈ జాతరతో ఊరంతా సందడిగా ఉంటుంది. ఊళ్లో ప్రతి ఇంటికి అమ్మవారి దర్శనం ఉంటుంది, కాటమయ్య బోనాలు తీస్తారు.

– కాకనూరి రంగయ్య, చిత్రియాల

# అసంపూర్తి కాల్వలు.. రైతుల అవస్థలు!



ఎర్రగూడెం శివారులోని మైనర్ కాల్వ దుస్థితి



పొలంలోకి వెళ్తున్న కాల్వ నీటి ప్రవాహం

- నిడమనూరు పరిధిలో పూర్తికాని డీ–22 అనుబంధ కాల్వలు
- ఏఎమ్మార్పీకి నీటి విడుదలతో పొలాల్లోకి చేరుతున్న వరద
- తూములకు షెటర్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు

నిడమనూరు: ఏఎమ్మార్పీలో భాగంగా నిడమనూరు మండల పరిధిలోని చేపట్టిన లోలెవల్ కెనాల్ (ఎల్ఎల్‌సీ) అనుబంధంగా నిర్మించిన డీ–22 అనుబంధ కాల్వలను అసంపూర్తిగా వదిలేశారు. అయితే ఈసారి జూలైలోనే సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడంతో ఏఎమ్మార్పీ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో డీ–22 కాల్వ 47.75 కిలోమీటర్ వద్ద కాల్వ అసంపూర్తిగా నిర్మించి ఉండడంతో నీటి ప్రవాహం అధికమై వరిపొలాలు, బత్తాయి తోటల్లోకి చేరుతోంది. దీంతో తమ పంటలు నీట మునుగుతున్నాయని మండలంలోని ఎర్రగూడెం, మారుపాక, నిడమనూరు శివారులోని మాదారం గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏఎమ్మార్పీ అనుబంధంగా నిర్మించి లోలెవల్, హైలెవల్ మైనర్ల తూములకు షెట్టర్లు ఏర్పాటు చేసి, కాల్వలు, కాల్వ కట్టలను పటిష్ట పర్చాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

# ఒక్క మాత్రతో నులిపురుగులకు చెక్

- నులిపురుగులతో పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పెద్దవూర: నులి పురుగుల సమస్య పిల్లల్లో శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారిని రక్తహీనతకు గురిచేస్తుంది. పిల్లలలో అనేక అనారోగ్యాలకు కారణం అవుతున్న నులిపురుగులను కేవలం ఒకే మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కోసం ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్టు మాసాలలో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు ఆరోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఏడాదిలో రెండు సార్లు నివారణ మాత్రలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాదిలో భాగంగా సోమవారం నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ శ్రీకారం చుట్టారు. ఇందుకోసం సంబంధిత శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**అపరిశుభ్రతే కారణం**

అపరిశుభ్రత వలన నులిపురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లలకు నులి పురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. పిల్లలు ఎప్పుడూ చేతి గోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లు పెరిగినప్పుడు వెంటనే కత్తిరించుకోవాలి. లేకుంటే గోళ్లలో పేరుకున్న మట్టిద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన వలన కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరతాయి. కూరగాయలను కడుగక పోవడం, భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు పెట్టకపోవడం వలన కూడా నులిపురుగుల ప్రభావం ఉంటుంది.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం(ఫైల్)

**నివారణ ఇలా..**

పిల్లలలో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలిక పాములు, నులిపురుగులు, కొంకి పురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలి. మాత్రను భోజనం చేసిన తర్వాతనే వేసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒకరోజు లేదా రెండు రోజులలలో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి.

**మాత్రల డోసులు ఇలా..**

జబ్బుతో ఉన్నా లేదా ఎదైనా ఇతర మందులు వాడుతున్న పిల్లలకు ఈ నులిపురుగుల నివారణ మాత్రలు ఇవ్వకూడదు. ఏడాది పిల్లలకు మాత్రలు వేయకూడదు. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు అల్బెండజోల్ సగం మాత్రను ఇవ్వాలి. లేదా సిరప్‌ను 5 మిల్లీ లీటర్లు ఇవ్వాలి. రెండు నుంచి పంతొమ్మిదేళ్ల పిల్లలకు ఒక మాత్రను మధ్యాహ్న భోజనం తర్వాత నమిలి మింగేలా చూడాలి. పిల్లలు మాత్రను మింగకుండా వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పర్యవేక్షించాలి.

**తప్పనిసరిగా వేయించాలి**

జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పంతొమ్మిదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలి. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోనూ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నాం.

-డాక్టర్ నగేష్, పెద్దవూర, పీహెచ్‌సీ

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..**

బహిరంగ ప్రదేశాలలో మల, మూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. పండ్లు, కాయగూరలను శుభ్రంగా కడిగిన పిదప మాత్రమే వినియోగించుకోవాలి.